ఏజెంట్ల నుంచి ఆర్‌డిలకు అనుమతించాలి

ప్రజాశక్తి-విజయనగరం

తపాలా శాఖ ఏజెంట్ల ద్వారా పోస్టల్ రికరింగ్ డిపాజిట్లను నిలుపుదల చేయడం పట్ల పోస్టల్ ఆర్‌డి డిపాజిట్ ఖాతాదారులు చిప్పాడ ప్రభుదాస్, దామెర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్ల క్రితం పోస్టల్ ఆర్‌డి ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసిందని, దానిని కొనసాగించాలని కోరారు. ఏజెంట్ల వ్యవస్థ వలన ఆర్‌డి ఖాతాదారులు ఆలస్యం లేకుండా క్రమం తప్పకుండా ప్రతినెలా ఆర్‌డిలు చెల్లిస్తున్నారన్నారు. ఏప్రిల్ నుంచి ఆర్‌డిల సేకరణ నిలుపుదల చేయడం అన్యాయమని పేర్కొన్నారు. దీనివల్ల ఖాతాదారులకు ఇబ్బందులు కలగడమే కాకుండా ఆలస్య రుసుం కింద వడ్డీ కూడా చెల్లించవలసిన పరిస్థితి వస్తుందన్నారు. తపాల శాఖ ఏజెంట్ల ద్వారా ఆర్.డి.ల సేకరణపై తక్షణమే సరియైన నిర్ణయం ప్రకటించాలని ప్రకటనలో కోరారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- రాష్ట్రంలోనే జిల్లాకు ఆఖరి స్థానం
- 47 శాతంతో ప్రథమ ఇంటర్‌లో 12వ స్థానం
- ద్వితీయ ఇంటర్‌లో 57 శాతంతో ఆఖరు స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎప్పటిలాగే ఈఏడాది కూడా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలదే పైచేయి అయ్యింది. అయితే ఫలితాల సాధనలో ప్రథమ ఇంటర్‌లో విజయనగరం ఉమ్మడి జిల్లా 12వ స్థానంలో నిలవగా, ద్వితీయ ఇంటర్‌లో ఆఖరిస్థానంలో నిలిచింది. ప్రథమ ఇంటర్ లో జనరల్ విద్యార్థులు 18187 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 8603 మంది ఉత్తీర్ణులై 47శాతం ఫలితాలు నమోదు చేశారు. ఒకేషనల్ విద్యార్థులు 4163 మంది హాజరు కాగా, 1909మంది ఉత్తీర్ణులై 46శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు 17,113మంది హాజరు కాగా వారిలో 9815మంది ఉత్తీర్ణులై 57శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో అవే స్థానాలు కొనసాగు తున్నప్పటికీ గత ఏడాది కంటే ప్రథమ ఇంటర్‌లో 5శాతం, ద్వితీయ ఇంటర్‌లో 4శాతం ఫలితాలు పెరిగి కొంత ఊరట లభించింది.

వీరఘట్టం.. ఫలితాల కోసం కళాశాల వద్ద ఎదురుచూస్తున్న విద్యార్థులు

శ్రీసత్యసాయి విద్యార్థుల హవా

ఎస్.భావన

వి.హైమావతి

ఎస్.ధనంజయ

కె.శ్రావ్య

కార్తికేయ

సాలూరు : ఇంటర్మీ డియట్ ఫలితాల్లో పట్ట ణంలోని శ్రీసత్య సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలి తాలు సాధించారు. మొదటి, రెండు సంవత్స రాలకు సంబంధించి ఎంపిసి, బైపిసి విభా గాల్లో కళాశాల విద్యా ర్థులు టౌన్ ఫస్ట్ సాధించారు. సెకెండి యర్ ఎంపిసిలో సువ్వాడ భావన 974, బైపిసిలో వావిలపల్లి హైమావతి 969 మార్కులతో సత్తాచాటారు. ఫస్టియర్ ఎంపిసిలో సలాది ధనుంజయ 447, కొల్లి శ్రావ్య 444, బైపిసిలో సిహెచ్.కార్తికేయ 426 మార్కులు సాధించారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై ప్రిన్సిపల్ సిహెచ్. ప్రసాదరావు, అధ్యాపకులు, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్ అభినందించారు.

బిజెపి దేశానికే ప్రమాదకరం

ప్రచార భేరి సభలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు దేశానికే ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ చెప్పారు. బిజెపి విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తున్న ప్రచారభేరిలో భాగంగా బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ఎస్.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులు, కార్మికులు, గిరిజనుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆగ్రహించారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ల తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజల సంపదను దోచిపెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేసి లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులను కడుపుకోతకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. మైనింగ్ పేరుతో వందలాది ఎకరాల అటవీ భూములను తన అనుకూల కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేకత విధానాలను అవలంభిస్తున్న బిజెపి, దాని మిత్ర పక్షాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సుబ్బరావమ్మ కోరారు. సిపిఐ రాష్ట్ర నాయకులు కె.కామేశ్వరరావు మాట్లాడుతూ కులం, మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధానాలను బిజెపి అవలంబిస్తోందని చెప్పారు. సామాన్యులపై పన్నుల భారం మోపుతూ కార్పొరేట్లకు వేలకోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తోందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. సాలూరు ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం అదానీ కంపెనీకి అనుమతి మంజూరయిందన్నారు. దీనివల్ల సారిక, నేరళ్ళవలస, దొరలతాడివలస, మూలతాడివలస గ్రామాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని చెప్పారు. గ్రానైట్, మాంగనీస్ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇస్తూ గిరిజనుల జీవనోపాధికి గండి కొడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు, జిల్లా నాయకులు జీవా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాచిపెంట : పాచిపెంటలో వామపక్షాల నాయకులు బోను గౌరి నాయుడు, గంట సత్యనారాయణ, జరజాపు వెంకటరమణ, కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ రంగం నాశనమైందన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహం వల్ల విభజన హామీ అమలుకాలేదన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని చెప్పారు. భవిష్యత్తు పోరాటాలలో ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు.

సాలూరులో ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

పాచిపెంటలో ప్రచారభేరిలో పాల్గొన్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

17,318 మందికి వసతి దీవెన

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.16.50 కోట్లు జమ

ప్రజాశక్తి-కలెక్టరేట్

జగనన్న వసతి దీవెన రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లాలో 17,318 మంది విద్యార్థులు జగనన్న వసతి దీవెన పథకం కింద అర్హులు కాగా, వారి తల్లుల ఖాతాల్లో రూ.16.50 కోట్లు జమయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అధికారులు, విద్యార్థులు, తల్లులు హాజరయ్యారు.

జిల్లాలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ కింద 12,389 మంది విద్యార్థులకు రూ.11.79 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 2,167 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ.2.06 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 1,887 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.1.79 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన ఇబిసి కులాల సంక్షేమం కింద 643 మంది విద్యార్థులకు రూ.62.40 లక్షలు, కాపు కులాల సంక్షేమం కింద 202 మంది విద్యార్థులకు రూ.19.10 లక్షలు, ముస్లిం మైనారిటీ సంక్షేమం కింద 20 మంది విద్యార్థులకు రూ.1.90 లక్షలు, క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమం కింద 10 మంది విద్యార్థులకు లక్ష రూపాయలు జమయ్యాయి.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం నియోజకవర్గంలో 5,259 మంది విద్యార్థులకు రూ.5.01 కోట్లు, సాలూరు నియోజకవర్గంలో 3,526 మందికి రూ.3.34. కోట్లు, కురుపాం నియోజకవర్గంలో 4,121 మందికి రూ.3.94 కోట్లు, పాలకొండ నియోజకవర్గంలో 4,412 మందికి రూ.4.19 కోట్లు విడుదలయ్యాయి.

కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి పి.శశిభూషణ రావు, జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి బి.సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు నీలాద్రి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పివిటిజి సర్వే

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశకి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోగల పివిటిజిల సర్వే సక్రమంగా చేపట్టి కచ్చితమైన డేటాను సమర్పించాలని పిఒ కల్పనకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు, టిఎస్‌పి మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పివిటిజి కుటుంబాలు ఎన్ని ఉన్నాయి, పక్కా గృహాలు ఎంతమందికి ఉన్నాయి, ఇంకా విద్యుత్తు సదుపాయం లేని కుటుంబాల సమాచారం సేకరించాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామాలు, నెట్ వర్క్ సదుపాయం లేని గ్రామాల సమాచారం సేకరించాలని కోరారు. ఈ సమాచారం ఈనెల 29వ తేదీ నాటికి పూర్తి చేసి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖాధిపతులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

వికలాంగుల కోసం నోడల్ అధికారి

కలెక్టర్ నిశాంత్

ప్రజాశక్తి-కలెక్టరేట్

విద్యా శాఖలో వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ కార్యాలయంలో గెజిటెడ్ స్థాయి అధికారిని సమస్యల పరిష్కారానికి నిబంధనల మేరకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల చట్టం జిల్లాలో పక్కాగా అమలు చేయాలన్నారు.

వారితో ప్రతిఒక్కరూ స్నేహపూరిత వాతావరణం కలిగి ఉండాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల హక్కులు కాపాడుటకు 2016 సంవత్సరంలో చట్టం తీసుకొచ్చారని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న జిఒ 13ను విడుదల చేసిందని చెప్పారు. చట్టం, నిబంధనలు అమలును పక్కాగా పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై వారికి అర్థమయ్యే రీతిలో సమాచారం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆరోగ్య రక్షణకు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వికలాంగులు అందరినీ నమోదు చేసి వారికి నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ అందించుటకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వికలాంగుల హక్కుల హరణ ఎక్కడా జరగరాదని, ఫిర్యాదులు అందితే తక్షణం పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయాల్లో వారిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, వివక్ష చూపడం, అసభ్యంగా ప్రవర్తించడం నేరమన్నారు. ఏ సంస్థలోనూ, ఎటువంటి వివక్ష కూడా ఉండరాదని ఆయన స్పష్టం చేశారు.

విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 15,830 మందికి వికలాంగుల పింఛను లభిస్తుందన్నారు. కొత్తగా మరికొన్ని పింఛన్లు మంజూరు కానున్నాయని చెప్పారు. బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీ నోటిఫికేషన్‌ను పూర్వ విజయనగరం జిల్లా ప్రాతిపదికగా విడుదల చేశారని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల కేసులు చూసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించే అవకాశం ఉందని చెప్పారు. ఆర్‌టిసి, రైల్వేల్లో రాయితీపై పాసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వాగ్దేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, బెహరా మనోవికాస కేంద్రం (శ్రీకాకుళం) నిర్వాహకులు బి.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్

మమా అనిపించేశారు!

తూతూమంత్రంగా మున్సిపల్ సాధారణ సమావేశం

సమావేశానికి హాజరైన సభ్యులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. ఏ చర్చా లేకుండా, పాఠాలు చెప్పినట్లు చెప్పి మమా అనిపించేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశం.. 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశానికి వచ్చిన ఇద్దరు టిడిపి కౌన్సిల్ సభ్యులు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్.. ఆలస్యంగా ప్రారంభం కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరైనప్పటికీ కొంత సమయం తర్వాత పనుల నిమిత్తం వెళ్లిపోయారు. అజెండాలో పొందుపరిచిన 14 అంశాల్లో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 12 అభివృద్ధి పనుల అంశాన్ని, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాలకు చెందిన ఒక్కో అంశాన్ని మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం టేబుల్ అజెండాలో పొందుపరిచిన 5 అంశాలను కూడా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. దీంతో ఈ సమావేశం వేగంగానే ముగిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ ఆర్‌ఒ రూబేన్ దిబ్బ, ఎఇలు జి.ఆనంద్, సన్యాసినాయుడు, ఆర్‌ఐ పి.నారాయణ రావు ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పేదల సంక్షేమం కోసం నిరంతరం సిఎం జగన్ మోహన్‌రెడ్డి తపన పడుతున్నారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలో తుండ పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రీ పేదల గురించి ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేయలేదని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు వివరించారు. ఇంకా ఏ ఇంటిలో సంక్షేమ పథకాలు అందకపోయినా, వారిని గుర్తించి అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇటికివలస గిరిజనులు గ్రామానికి సరైన రహదారి లేదని డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందిస్తూ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, సర్పంచ్ నూకయ్య, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, సుధ పాల్గొన్నారు.

సాలూరురూరల్.. వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతంపేట.. గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట : మండలంలోని తాలాడ, వెంకటిగూడ, చీడిమానుగూడ, లంగడుగూడ గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి గడప గడపకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా? వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తున్నారా? అని ఆరాతీశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాను వివరించారు.

సీతానగరం : సీతానగరం మండల కేంద్రంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో సీతానగరం, బలిజిపేట మండలాల సచివాలయ కన్వీనర్లు, పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ నవరత్నాల హామీలను 98 శాతం నెరవేర్చిన సిఎం జగన్‌ను ఆశీర్వదించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు అలజింగి రవికుమార్, మామిడి బాబ్జి, వైస్ ఎంపిపిలు వెలిది సాయిరాం, టి.సూర్యనారాయణ, బలగ శ్రీరాములు నాయుడు, గుడివాడ జగన్ పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన హౌసింగ్ ఎఇ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో గృహ నిర్మాణశాఖ ఎఇ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తమ కార్యాలయంలో ఓవ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుబడ్డారు. కున్నారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు బొద్దాన పార్వతి, ఇప్పిలి ఈశ్వరమ్మ, పైడమ్మ, వసంత, బొద్దాన సన్యాసమ్మలకు జగనన్న కాలనీ ఇల్లు మంజూరయ్యాయి. అయితే ఇళ్ల నిర్మాణానికి బిల్లుకు ఒక్కొక్క ఇంటికి రూ.30వేలు ఇవ్వాలని ఎఇ డిమాండ్ చేశారు. గతంలో ఒక్కో ఇంటికి కొంత మొత్తం చెల్లించారు. మిగతా రూ.20వేలు బుధవారం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఇప్పిలి ఈశ్వరమ్మ బంధువు రామకృష్ణ ఎసిబి టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేశాడు. అవినీతి నిరోధశాఖ డిజి రాజేంద్ర ప్రసాద్ ఇచ్చిన ఆదేశాలతో డిఎస్‌పి పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో సిఐలు మహేష్, రమణ, మహేశ్వర రావు, ఇద్దరు ఎస్ఐలు నిఘా వేశారు. గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో ఎఇ వెంకటేశ్వరరావు రూ.20వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎఇ వెంకటేశ్వరరావు

నైపుణ్య కోర్సులపై దృష్టిపెట్టాలి

- విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో యువత పెడదారి పట్టకుండా టెక్నాలజీలోని మంచిని స్వీకరించి చెడును తిరస్కరించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. నైపుణ్య కోర్సులపై దృష్టి పెట్టాలన్నారు. ఏది మంచి, ఏది చెడు అని విశ్లేషించుకొని తమ కెరీర్ కు నష్టం కలగకుండా చూసుకుంటూ యువత ఆరోగ్యకరమైన సమాజానికి నడుం కట్టాలని పేర్కొన్నారు. కొండకరకాం వద్ద గల గిరిజన విశ్వవిద్యాలయం లో బుధవారం విద్యార్థులకు కెపాసిటీ బిల్డింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఇలాంటి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు వారి కెరీర్ లో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు కేవలం మార్కుల కోసమే చదవకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించు కోవాలని, కళాశాలల్లో కూడా తప్పనిసరిగా నైపుణ్య కోర్సులు పెట్టి వాటిలో శిక్షణ ఇవ్వాలని అన్నారు. విద్యార్థులు వత్తిడిని తట్టుకునే శక్తిని పెంచుకోవాలని, సెల్ఫ్ మోటివేషన్ ను

మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పద్మ

మించినది మరొకటి లేదని అన్నారు. ఒకప్పటి పరిస్థితులు లేవని ఆడ పిల్లల జీవితాల్లో అనేక మార్పులు సంభవించాయని, ప్రభుత్వం కూడా చదువు కోసం అనేక అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. బాల్య వివాహాలు, చదువు మానివేయడం అన్నిటికీ పేదరికమే కారణం అవుతోందని, ఈ పేదరికాన్ని జయించి అందరూ చదువుకునేలా ప్రభుత్వం విద్యను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అనేక బాల్య వివాహాలు జరుగుతున్నాయని, ఈ వ్యవస్థను మార్చడం లో యువత కీలక పాత్ర వహించాలని అన్నారు. సభాధ్యక్షత వహించిన గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కట్టిమణి మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని దానిని సాధించడమే కర్తవ్యంగా భావించాలని అన్నారు. నూతన విద్యా విధానం లో కంపల్సరీ అప్రెంటిస్ షిప్ అనే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనివలన ప్రతి విద్యార్థికి నైపుణ్యం వస్తుందని, తద్వారా ఉపాధి సులువుగా పొందగలరని అన్నారు. కార్యక్రమంలో లెండి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, బయో టెక్ డిపార్టుమెంటు హెచ్ఒడి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దివ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్ తదితరులు కెపాసిటీ బిల్డింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్ పై అవగాహన కలిగించారు.

లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించాలి

లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించాలని మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక గిరిజన యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మగ వారు మారాలని ఈ తరం ఆడ పిల్లలు కోరుకుంటున్నారని, సమాజం లో సగ భాగమైన ఆడవారిని హేళన చేస్తూ, అవమానిస్తే ఆ సమాజం ఎలా ముందుకు నడుస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలు మహిళల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కేవలం ఓటు బ్యాంకు గానే చూసాయని, ఆడవారి గురించి ఆలోచన చేయని విజనరీ ఎందుకని ఎద్దేవా చేసారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి మహిళలకు సమాన అవకాశాలను కల్పించారని, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారని అన్నారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమని, వారి జీవితాల్లో అనేక మార్పులు సంభవించాయని అన్నారు.

సకాలంలో విధులకు హాజరు కావాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

సకాలంలో విధులకు హాజరుకావాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ సచివాలయ డిడిఒలకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిడిఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, ఎక్కడైనా బోర్లు మరమ్మతులకు గురైతే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. తక్షణమే బోరు మరమ్మతులు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సక్రమంగా విధులకు హాజరై ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒ కె.సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

వీరఘట్టంలో ట్రాఫికర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రం వీరఘట్టంలో బుధవారం ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఒకవైపు ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో కాలువ నిర్మాణాలు చేపడుతున్నారు. మరోవైపు రహదారిపైనే కూరగాయల విక్రయాలు చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద నిత్యం ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. ఈ నెల 30 నుంచి వీరఘట్టంలో జరిగే పైడితల్లమ్మ పండగకు వేల సంఖ్యలో జనం తరలిరానున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొరులుపేటలో ఎల్ఇడి దీపాలు

ప్రజాశక్తి -భామిని

బాలేరు పంచాయతీ పరిధి సోలికిరి గ్రామ శివారునున్న మొరులుపేట వీధిలో సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ ఎల్ఇడి దీపాలను బుధవారం ఏర్పాటు చేశారు. వేసవిలో రాత్రివేళ విషసర్పాలు, క్రిమికీటకాలు సంచరించే అవకాశం ఉందని, ఎటువంటి ప్రమాదం జరగకుండా, పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపిటిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో కిల్లారి చంటి, బర్రి శంకర్ రావు, లయన్ మాన్ రాజేష్ పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం రైతుకు లాభదాయకం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సూక్ష్మ సేద్యం రైతుకు ఎంతో లాభదాయకమని తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చునని ఎపి ఎంఐపి పిఒ టివిఎన్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని అలుగుబిల్లి గ్రామానికి చెందిన లగుడు రామకృష్ణ అనే రైతు ఏర్పాటు చేసిన బిందు సేద్యం యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జీడి మామిడి, సపోటా, కొబ్బరి, ఆయిల్ ఫామ్, కూరగాయలు పంటల సాగుకు బిందు తుంపర్ల సేద్య పద్ధతులు అనువైనవన్నారు. బిందు తుంపర్ల సేద్యం కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయకులు జి. శ్రీకాంత్, ఎమ్ఐ ఇంజనీర్ శ్రీనివాసరావు, మూర్తి, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిపేటలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి-డెంకాడ

మండలం లోని చోల్లంగిపేటలో మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ ఆధ్వర్య ంలో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని, ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో టిడిపి విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, నాయకులు కలిదిండి పాణిరాజు, జగదీష్, బగ్గ లక్ష్మణరావు, ఎడ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లేని పంచాయతీలకు అవార్డులా?

ప్రజాశక్తి- నెల్లిమర్ల

కనీసం అభివృద్ధికి నోచుకోని పంచాయతీలకు ప్రభుత్వం అభివృద్ధి జరిగినట్లు అవార్డులు ఇవ్వడం సిగ్గుచేటని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బూర్లే శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి పంచాయతీ వ్యవస్థ అత్యంత దుర్భరమైన పరిస్థితిలోకి వెళ్లిందని, కనీసం మంచినీటి కోసం పంపుసెట్ రిపేర్ చేయించడానికి కూడా నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు పక్కన శుభ్రం చేయిద్దామంటే పంచాయతీ సిబ్బందికే జీతాలు చెల్లించలేని స్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే గ్రామాలను అభివృద్ధి చేసిన తరువాత అవార్డులు ప్రకటిస్తే బాగుంటుందన్నారు. కేవలం ఆ పార్టీ సర్పంచుల మెప్పుకోసమే ఈ అవార్డులు ఇచ్చారని ఆరోపించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని నెలివాడలో సెంచూరియన్ యూనివర్శిటీకి చెందిన అగ్రికల్చర్ బిఎస్‌సి నాలుగో సంవత్సరం విద్యార్థి తాళ్లపూడి మౌనిక సహజ ఎరువులు వాడకంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు ఎటువంటి రసాయన ఎరువులూ వినియోగించకూడదన్నారు. ద్రవ జీవామృతాలు తయారు చేసి ఎకరాకు 800 లీటర్లు వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు. అనంతరం

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని విద్యార్థి మృతి

గరివిడి: మండలంలోని కొండపాలెం గ్రామానికి చెందిన సారిక మదన్(11)ను కారు ఢీ కొనడంతో మృతి చెందాడు. కందిపేటలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఆరో తరగతిలో చేరాలని బుధవారం అతని తల్లి సారిక సంతోషితో కలిసి గరివిడిలోని ఒక ప్రయివేటు పాఠశాలకు వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామం మదన్ సైకిల్ పై వస్తుండగా గరివిడి శ్రీరామ కాలేజీ ఎదురుగా వెనక నుండి కారు వచ్చి బలంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మదన్‌తో పాటు ఈ ప్రమాదంలో రౌతు స్వప్నకి బలమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రత్యక్షంగా చూసిన తల్లి చెప్పలేని మనో వేదానికి గురైంది. విషయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యార్థులకు గాయాలు

లక్కవరపుకోట: విశాఖ - అరకు ప్రధాన రహదారిలో గల మండలంలోని చిన్నహర్జున వీధి సమీపంలో నిర్మిస్తున్న మధుము వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ వైద్య కళాశాల విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ముంబాయికి చెందిన మహమ్మద్ నవాజ్, జి చిన్మయి కాకినాడ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్నారు. వీరు విశాఖలోని ద్విచక్ర వాహనం అద్దెకు తీసుకుని అరకు ప్రాంతాన్ని వీక్షించేందుకు వెళుతుండగా ఎల్ కోట మధుం వద్దకు వచ్చేసరికి కంకర రాళ్ళను తప్పించబోయే క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో పడిపోయారు. చిన్మయికి ముఖము, చెయ్యి, భుజాలపై గాయాలవగా నవాజ్‌కు చెయ్యి, నడుము భాగాలలో గాయాలయ్యాయి. క్షతగాత్రులకు స్థానిక పిహెచ్‌సి డాక్టర్ పివి మురళీకృష్ణ వైద్య సేవలందించారు.

ఇంటర్‌లో అదరగొట్టేశారు

సవర శంకరరావు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మల్లిలో ఉన్న ప్రతిభ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అదరగొట్టారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ 40 మంది పరీక్ష రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్ 40 మంది పరీక్ష రాయగా 35 మంది పాసయ్యారు. ఇదే కళాశాలకు చెందిన సవర శంకర్రావు(ఎంపిసి) 969 మార్కులు సాధించాడు. వీరిని ప్రిన్సిపల్ యుగంధర్ అభినందించారు.

సీతంపేట బాలికల గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 116 మంది పరీక్ష రాయగా 102 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 171 మంది పరీక్ష రాయగా 157 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల కళాశాలలో ఒకేషనల్ వృత్తివిద్య కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం 19 మంది పరీక్ష రాయగా 19 మంది పాసయ్యారు. సెకండ్ ఇయర్‌లో 20 మంది పరీక్ష రాయిగా 20 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎం.శ్రీలత 956 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్స్‌లో కీర్తన 477 మార్కులు సాధించింది. సీతంపేట గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 154 మంది పరీక్ష రాయగా 123 మంది పాసయ్యారు. సెకండ్ ఇయర్లో 147 మంది పరీక్ష రాయగా 118 మంది పాసయ్యారు

ఆదర్శ పాఠశాలలో మెరుగైన ఫలితాలు

భామిని : భామినిలోని ఎపి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో 110 విద్యార్థులకు గాను 66 మంది ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్‌లో 90 మందికి 62 మంది పాసయ్యారు. సిఇసిలో రౌతు ప్రత్యూష 951 మార్కులు, ఎంపిసిలో రౌతు భార్గవి 948 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపిసి చౌదరి ఢిల్లేశ్వరి 430 మార్కులు సాధించింది.

ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు

వేదాంత విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలో వేదాంత జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. ఎంపిసిలో జి.విజయ గౌరీ 985 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. టి.సుజిత్ కుమార్ 980, బి.సాహిని 979, టి.కావ్య 976, అమృత వర్షిని 973, వినీల 968 మార్కులను సాధించారు. బైపిసిలో ఓలేటి నవ్యశ్రీ 980, ఆశ్రుత ప్రియ 979, వాణి 977, బాబి 968, వేణి 956, దీపిక 956, సంజన ప్రియా 955 మార్కులను సాధించారు.

ప్రథమ ఇంటర్లో ఎంపిసి గ్రూపులో కె.సుహర్షిని 463 మార్కులు, పి.అనురాధ 458, కె.దర్శిని 456, బి.తరుణ్ శివ సుబ్రహ్మణ్యం 456, ఆర్.అఖిల 450 మార్కులు సాధించారు. బైపిసిలో డి.గౌతమి 423, పి.జయశ్రీ 422, జి.నీలిమ 421 మార్కులు సాధించారు. వీరిని వేదంతా జూనియర్ కాలేజ్ చీఫ్ మెంటర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు అభినందించారు. ఇంతటి ఘన విజయం సాధించినందుకు అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

నేడు భగీరథ మహర్షి జయంతి

ప్రజాశక్తి కలెక్టరేట్

భగీరథ మహర్షి ఉత్సవాలను గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత కార్యాలయంలో ఉదయం 10.30 గం:లకు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి నగర, ఉప్పర, వెనుకబడిన తరగతుల సంఘ నాయకులు, సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2023-2024 సంవత్సరానికి ఒకటో తరగతి నుండి 8వ తరగతి వరకు విజయనగరంలో పూల్‌బాగ్ ఉన్న పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం కూడా కల్పించనున్నారు. మరిన్ని వివరాలకు 9494914959, 9440359775 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నేడు వాహనాలు వేలం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

సాలూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ అయిన 12 వాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ ప్రయోగ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో నాలుగు చక్రాల వాహనాలు 2, త్రిచక్రాల వాహనాలు 3, ద్విచక్ర వాహనాలు 7 వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాల్గొనాలని కోరారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా సత్యనారాయణ

సత్యనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం పిఎసిఎస్ చైర్మన్‌గా నర్సిపురానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కాపారపు సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేసుకొని, రుణాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు సక్రమంగా పంపిణీ చేసి, ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం సత్యనారాయణను ఎమ్మెల్యే జోగారావు, మండల ప్రజాప్రతినిధులు సన్మానించారు.

కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ ఎస్.నారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్‌పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, నాయకులు బలగ నాగేశ్వరరావు, భీమవరపు కృష్ణమూర్తి, బొమ్మి రమేష్ , చందాన శివాజీ, సవరపు రాజారావు, మజ్జి చంద్రశేఖర్, మడక విశ్వనాథం, గండి శంకరరావు, బోను రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు

వర్తక కళాసీ సంఘం భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గరలో నిర్మించిన కళాసీ సంఘం కార్యాలయ భవనాన్ని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ముందుగా భవనం వద్ద ఐఎఫ్‌టియు జెండాను జిల్లా అధ్యక్షుడు గేదెల సర్వేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం కార్యాలయం నుంచి పాత బస్టాండ్, బంధం వారి వీధి, మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.గణేష్, పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, పలు సంఘాల నాయకులు ఎస్.జయలక్ష్మి, బొత్స నర్సింగరావు, పిల్లా లక్ష్మణరావు, ఎస్.కృష్ణవేణి, మెరగాని గోపాలం, రాగోలు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనంలో నాణ్యత లోపించకూడదని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం మండలంలోని దారపాడు పంచాయతీ రామానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఉన్న రెండు బోర్ వేల్స్ కూడా పనిచేయకపోవడంతో వాటిని మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామానికి వెంటనే వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గోలుకుప్పగూడ గ్రామాన్ని కూడా పిఒ సందర్శించారు. గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడీ భవనాన్ని వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు సమస్య తీర్చుటకు చర్యలు తీసుకొంటామని హామీఇచ్చారు. గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు, వరద రక్షణ గోడలు నిర్మించుటకు చర్యలు తీసుకొంటామన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

పండగకు ఐటిడిఎ పిఒకు ఆహ్వానం

వీరఘట్టం : ఈ నెల 30 నుండి మే పదో తేదీ వరకు పైడితల్లి అమ్మవారి గ్రామదేవత పండగ సందర్భంగా బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పాలకొండ నగరపాలక కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావును ఆహ్వానించారు.

మురికి కూపంలా తయారైన రోడ్డు

బురదమయంగా మారిన మర్రివీధి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలో మర్రివీధి బురదమయంగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పైనుంచి వచ్చిన వరద నీరు కాలువలు ఇరుకుగా ఉన్నందున వీధిలోకి ప్రవేశించింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత కొన్నేళ్లుగా కాలువలో పూడికలు తొలగించకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి తలెత్తుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పైపులైను ధ్వంసం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామంలో పంపుహౌస్ వద్ద బోరు పైపును గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసినట్లు సర్పంచ్ సీమల సుజాత తెలిపారు. దీనిపై జియ్యమ్మ వలస పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొందని, తమపై అక్కసుతో బోరు పైపులను విరగగొడుతూ తాగునీరు ప్రజలకు అందకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు

ధ్వంసం చేసిన పైపులైను

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

అంగన్వాడీ పిల్లలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. బుధవారం కురుపాం మేజర్ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, నిల్వ ఉన్నటువంటి పాలు, గుడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఆమె సూచించారు.

నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-వీరఘట్టం

వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ కిశోర్‌వర్మ వాహనదారులకు సూచించారు. బుధవారం వీరఘట్టంలోని భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు అందుబాటులో ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం ప్రమాదకరమన్నారుక. వాహనం నడిపిన ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.